జయశ్రీ, సెప్టెంబర్ 1967

తను ఎదుట ఉండగా తన్ను కాదని భార్యను బిచ్చమడగడం
తన వ్యక్తిత్వం మీదనే దెబ్బతీసినట్లనిపించిందతనికి....

# చేతకాని వాడి కథ

శ్రీమతి యిచ్చిన కాఫీ తాగి అరుగుమీద కూర్చున్నాడు శ్రీనివాసరావు. ఆదివారమంటే అతనికి ప్రత్యేకమైన అభిమానం. ఆ రోజు ఆఫీసుకి వెళ్ళనవసరం లేదు. ఆఫీసుకే కాదు – తను అవసరం లేదనుకుంటే ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు.

అయితే శ్రీనివాసరావుకి ప్రతి ఆదివారమూ అరుగుమీద కూర్చునే అలవాటు లేదు. ఆదివారమే కాదు – అసలంతకు ముందెన్నడూ అరుగుమీద కూర్చోలేదతను. కానీ యీరోజు అతనలా కూర్చునేందుకు ప్రత్యేకమైన కారణముంది.

చాలాకాలంగా అతనికి కథలురాయాలనే కోరిక ఉండేది. కానీ ఎప్పుడూ అతను ప్రయత్నించి చూడలేదు. కథలు రాయడం చాలా కష్టమనీ అది తనవంటి వాళ్ళ వల్ల జరిగే పని కాదనీ అతను అనుకుంటూ ఉండేవాడు. అయితే అతని అభిప్రాయాన్ని సుబ్బారావు ఇట్టే మార్చేశాడు.

శ్రీనివాసరావు అదొక తరహా మనిషి. అతనికి ప్రతివాడూ తనకంటే గొప్పవాడిగానే కనిపిస్తాడు. తనలో లేని కొన్ని మంచి గుణాలు ఎదుటివాడిలో ఉన్నట్లూ వాటివల్ల ఆ ఎదుటివాడు తనకంటే గొప్పవాడయినట్లూ అతనికి అనిపిస్తుంటుంది. కానీ – అటువంటి శ్రీనివాసరావు కూడా చిన్నచూపు చూసే వ్యక్తి ఒకడున్నాడు. అతనే సుబ్బారావు! సుబ్బారావేం చేసినా అందులో విశేషం కనిపించదు శ్రీనివాసరావుకి. తలచుకోకగాని, తలచుకుంటే తనూ అది చేయగలనని అనుకుంటాడతను. అటువంటి సుబ్బారావు ఒక కథ రాయడమూ, అది ఒక పత్రికలో పడటమూ జరగడంతో – "నేను మాత్రం కథ ఎందుకు రాయలేను?" అనుకున్నాడు శ్రీనివాసరావు. వెంటనే అతను సుబ్బారావునే అడిగాడు "కథ రాయడానికి ఏంచేశావేమిటి" అని. వీధరుగుమీద కూర్చుని వచ్చే పోయేవాళ్ళని చూస్తూ, జరిగే సంఘటనలను జాగ్రత్తగా పరిశీలిస్తుంటే చక్కని ఆలోచనలు వస్తాయని, తన అనుభవం చెప్పాడు సుబ్బారావు.

సుబ్బారావు లాంటివాడికే ఆవిధంగా కథ రాయడం వచ్చినప్పుడు – తనకు మాత్రమెందుకు రాదనే ఉద్దేశ్యంతో ఆ రోజు అరుగుమీద కూర్చున్నాడు. శ్రీనివాసరావు, అతను కథ రాయాలని గట్టిగా అనుకోడానికి మరో కారణముంది. తను కథ రాయలేకపోతే

సుబ్బారావుకంటే తక్కువవాడైపోతాడనే భయమే అది.

శ్రీనివాసరావు చూస్తుండగా రోడ్డు మీంచి ఒకటిరెండు కార్లు వెళ్ళాయి. రిక్షాలు తరచుగా పోతున్నాయి. రకరకాల మనుష్యులు అటూఇటూ పోతున్నారు. వాళ్లలో ఎరిగున్నవాళ్ళు కొంతమంది శ్రీనివాసరావునోసారి పలకరించి పోతున్నారు.

క్రమంగా శ్రీనివాసరావు ఆలోచనలో పడ్డాడు. కారూ, రిక్షా పోతుంటే అతనికి నిరుపేదల మీద కథ రాయాలనిపించింది. ఆ విషయమై తీవ్రంగా ఆలోచిస్తూండగా “భవతి భిక్షాందేహి!” అన్నమాటలు అతనికి ధ్యానభంగం చేశాయి.

శ్రీనివాసరావు ఎదురుగా ఉన్న వ్యక్తిని చూశాడు. కాషాయ వస్త్రాలు, జడలు గట్టిన తలా, పెరిగిన జేబురు గడ్డం, చంకలో జోలి, చేతిలో కమండలం – నొసట విభూతి రేఖలతో సాక్షాత్తు పరమ శివునిలా ఉన్న బైరాగి చిరుదరహాసంలో ఉన్నాడు.

“పైకి వెళ్ళండి బాబూ!” అనబోయి శ్రీనివాసరావు ఆగిపోయాడు. పూర్వకాలం భక్తులను పరీక్షించడానికి పరమశివుడిలాగే బైరాగి వేషంలో వచ్చేవాడుట, ఎంత కలికాలమయితే మాత్రం దేవుడలా రాకూడదని ఏముంది?

అతను జేబులో చేయిపెట్టి రెండు పైసలు తీసి సాధువుకు ధర్మం చేశాడు. సాధువు హుందాగా అతన్ని దీవించి వెళ్ళిపోయాడు.

సాధువును చూసినప్పట్నించీ ఏదైనా జానపద కథ రాసి చందమామకు పంపించాలని అతనికి అనిపించసాగింది. ఆ విషయమై అతను ఆలోచిస్తుండగా “అమ్మా! బిచ్చం పెట్టించమ్మా” అన్న పిలుపు వినిపించింది. అతను ఎవరా అని చూశాడు. జీర్ణ వస్త్రాలతో, కేశ సంస్కారంలేని తలతో, జేబురు గడ్డంతో – వికృతంగా ఉన్న ఒక నడివయస్కుడతనికి కనిపించాడు. ఇందాకటి సాధువు – గెడ్డం ఉన్నప్పటికీ, కేశసంస్కారం లేకపోయినప్పటికీ చాలా శుభ్రంగా ఉన్నాడు. వీడేమిటి ఇలా ఉన్నాడురా అనుకున్నాడతను. అప్పుడతనికి ముష్టివాళ్ళమీద కథ రాయాలనిపించింది. వాళ్ళలోనూ ధనికులనీ, పేదలనీ రెండు వర్గాలున్నట్లు ఒక హాస్యకథ రాస్తే....

“అమ్మా కాస్త బిచ్చం పెట్టించు తల్లీ!”

శ్రీనివాసరావుకి ధ్యాన భంగమయింది. వాడింకా వెళ్ళలేదు. వసుంధర లోపలేదో పని చేసుకుంటున్నట్లుంది. తనే వాడిని పొమ్మని చెప్పాలి. “పోరా పో” అన్నాడతను.

“ఆదివారంపూటా పొమ్మంటారేమిటి బాబూ!” అన్నాడు వాడు.

శ్రీనివాసరావు మెదడు చాలా చురుకుగా పనిచేస్తుంది. అందువల్ల ముష్టివాడన్న మాటలు వెంటనే అర్థమయాయి. అయితే ఆదివారం నాడు ముష్టివాళ్ళని పొమ్మనకూడదన్నమాట. ఎందుచేత? ఎందుకోసం? అసలు ఈ రూలు ఎవరు పెట్టారు. ప్రభుత్వ శాసనమయుండదు. మరి.... అసలు పొమ్మంటే ఏమవుతుంది?

ఏమవుతుందో చూడాలనిపించి “ఆదివారం లేదు గీదివారం లేదు. పొమ్మంటుంటే నీక్కాదూ?” అన్నాడు.

బిచ్చగాడు నవ్వేశాడు. బహుశా అతనిలోని బలహీనతను కనిపెట్టేశాడో ఏమిటో,

"దరమ ప్రెబువులు మరి మీరూ అలాగంటే ఎలా బాబూ!" అంటూ ఓసారి చేతులు జోడించాడు.

బిచ్చగాడు ధర్మప్రభువనగానే శ్రీనివాసరావుకి చాలా ఆనందం కలిగింది. ప్రభువనే పదాన్ని మహారాజులకి వాడతారు. దాన్ని వీడు తనకి వాడేడంటే వీడికి తనలో ఏమన్నా విశిష్టమైన లక్షణాలు కనిపించేయా?

వెంటనే అతనికి తను గుమస్తానని గుర్తుకువచ్చింది. తను ఏ విధంగానూ ప్రభువు కాడు! ఆ లక్షణాలు తన ముఖంలో కూడా ఉండి ఉండవు. తన వద్దనుంచి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంలో వీడలా అని ఉంటాడు. వెంటనే అతనికి బిచ్చగాడి మీద కోపం వచ్చేసింది. తనని ప్రభూ అని పిలవడం గౌరవం కాదు. అవమానం! తన్ను అవమానించిన వీడికి ఏమీ యివ్వకూడదని నిశ్చయించుకున్నాడతను.

"ధర్మప్రభువు లెవరూ యిక్కడ లేరుకానీ పక్కింటికి వెళ్ళు!" అన్నాడు విసుగ్గా. కానీ బిచ్చగాడిలో చలనం కనిపించలేదు. పైగా వాడు తాపీగా పాడడం మొదలుపెట్టాడు.

వెనక బెట్టినదేది కూడా వెనుకరాదని తెలుసుకో. వెనక జన్మములోని కర్మము ఈ జన్మని తెలుసుకో.....

బిచ్చగాడి కంఠం కర్ణకఠోరంగా ఉన్నప్పటికీ శ్రీనివాసరావు కోపం హెచ్చుడానికి కారణం మాత్రం అది కాదు. ఆ పాట బిచ్చగాడు కేవలం తనను ఉద్దేశించే పాడుతున్నాడని అతను గ్రహించాడు. తన ఇంటి ముందు అడుక్కునేందుకు వచ్చి పొమ్మంటేపోకుండా తన మీదే వ్యంగ్యంగా పాట పాడుతాడా?

"ఏయ్ - పాట ఆపిపోతావా లేదా?"

ఈసారి అతను గర్జించాడు. కానీ అది గుమస్తా గర్జనలాగే ఉంది. ఆఫీసరు మొహం వాచేలా చీవాట్లు వేసినప్పుడు వచ్చే విపరీతమైన కోపాన్ని అణచుకోవడం అలవాటైపోయిన అతనికి అవసరం లేనప్పుడు కూడా కోపం అణగిపోతోంది. కోపం అణగిపోవడమంటే మాటల రూపంలో బయటపడేశక్తి కోపానికి నశించడమన్నమాట!

బిచ్చగాడు పాట ఆపి "ఒక్కపైసా ఇప్పించండి బాబయ్యా" అన్నాడు.

అంటే అర్థం! పైసా ఇస్తే కానీ వెళ్ళనని గదా - ఏమిటి వీడి మొండిధైర్యం - విసిగిపోయి తను డబ్బులిచ్చేస్తాడనా? ఏమయినాసరే తను లొంగడు - తనేం మరీ అంత చేతకానివాడు కాదు.

"పయిసా గియ్‌సా అంటూ కబుర్లు చెప్పక - అవతలకు నడు"

బిచ్చగాడు అతని మాటలు విన్నట్లు లేదు. మళ్ళీ తాపీగా పాట మొదలుపెట్టాడు. "వెనకబెట్టినదేది కూడా వెనక రాదని తెలుసుకో....."

శ్రీనివాసరావుకి తలనొప్పి వచ్చిందంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఆపాట వింటూంటే ఎవరికయినా తలనొప్పి వస్తుంది. కానీ అతనికి తలనొప్పితోపాటు ఉక్రోషం కూడా వచ్చింది.

ఈ బిచ్చగాడు తన్ని చేతకాని వాడి కింద లెక్కకట్టేశాడు. అందుకే తన మాట

లెక్కచేయటం లేదు. లేకపోతే ఎన్నిసార్లు చెప్పినా కదలడేం? ఇక ఒక్కటే ఉపాయం - తనూ వాడి చేతకాని తనాన్ని వేలెత్తిచూపించి వాడు సిగ్గుపడిపోయేలా చేయాలి, దాంతో కాని వాడు కదలడు.

"ఎద్దులా ఉన్నావు - ఎక్కడైనా పనిచేసుకుని బ్రతకొచ్చుదూ - ఇలా పాటలు పాడి పదిమంది ప్రాణాలు తీయకపోతే?"

ఈసారి బిచ్చగాడు విషాదంగా నవ్వాడు. పాట ఆపివేసి "నిజం బాబయ్యా, కానీ నాబోటి వాడికి పనెవరిత్తారు. మాకూ కష్టపడి బతకాలనే ఉంటుంది. కానీ పనేదీ - పన్దొరికితే ఈ బిచ్చమెందుకూ ఎత్తుకోడం?" అన్నాడు.

శ్రీనివాసరావు ఇరుకున పడ్డాడు. బిచ్చగాడు తనకంటే తెలివైన వాడిలాగే ఉన్నాడు. తనేదో వాణ్ణి అవమానిద్దామనుకుంటే వాడు దానికీ సమాధానమిచ్చి పరోక్షంగా పనిచూసిపెట్టమంటూ తనకే బాధ్యత నప్పగించాడు. నిజమే మరి - చటుక్కున ప్రతివాడికీ పనెలా దొరుకుతుంది. ఈ విషయం మీద బాగా ఆలోచించి కథ రాస్తే....

"ఒక్కపైసా ఇప్పించండి బాబయ్యా!" మళ్లీ బిచ్చగాడి కంఠస్వరం.

శ్రీనివాసరావుకి పిచ్చెక్కినట్లయింది. "పొమ్మంటుంటే నీక్కాదూ?" అన్నాడు మళ్ళీ కోపంగా. ఈ కోపం కూడా ఇందాకటి కోపంలాగే ఉంది.

బిచ్చగాడికి లోపల్నుంచి వసుంధర కనిపించినట్లుంది. కాస్త గొంతు హెచ్చించి అన్నాడు. "అమ్మా అన్న పూర్ణమ్మ తల్లీ! పిడికెడు బియ్యం పెట్టించమ్మా, పున్నెముంటుంది?"

తను అరుగుమీద కూర్చుని ఉండగా తన్ను కాదని భార్యను బిచ్చమడగడం, తన వ్యక్తిత్వం మీదనే దెబ్బతీసినట్లనిపించింది అతనికి. ఈ ఇంట్లో తనకు విలువ లేదనే అనుకుంటున్నాడా? ఏమిటీ వీడి ఉద్దేశం!

"పొమ్మంటుంటే అలా అరుస్తావేం?" అతను మళ్లీ అన్నాడు. కానీ బిచ్చగాడు మాత్రం అతని మాటలు వినకుండా లోపలకే ఆశగా చూస్తూ, ఏదో కీర్తన పాడసాగాడు.

అప్పుడు శ్రీనివాసరావుకి చిన్న అనుమానం కలిగి క్రమంగా అదే భయంగా మారిపోయింది.

కొంపదీసి వసుంధర బియ్యం పట్టుకొచ్చి వేసేస్తే తన పరువేం కాను? ఈ బిచ్చగాడి దగ్గర కూడా తనకు విలువ లేకుండాపోతుంది. ఏమైనా సరే తనను బిచ్చం వేయనీయకూడదు. అతనిలా అనుకుని లేవబోతుండగా అనుమాన నివృత్తికన్నట్లుగా లోపల్నుంచి వసుంధర కంఠం ఖంగుమంది.

"ఇందాకట్నుంచి అలా అరుస్తుంటే అక్కడే కూర్చుని ఏంచేస్తున్నారండీ - వాణ్ణి పొమ్మని చెప్పరేం?"

ముందుగా "అమ్మయ్య వసు బిచ్చం వేయడం లేదు" అనుకున్నప్పటికీ ఇంకా ఆ బిచ్చగాడు వెళ్ళలేదనీ వాణ్ణి పంపించడం తన వల్ల కావటం లేదనీ గుర్తుకు రావడంతో ఇప్పుడేది దారి అనుకున్నాడతను.

బిచ్చం వేయకుండా బిచ్చగాణ్ణి బయటకు పంపించడంలో కష్టాలు ఉంటాయని

అతనికి తెలియదు. అతను ఇదివరలో ఎన్నడూ అరుగుమీద కూర్చొక ఈ అనుభవం పొందలేదు. పాపం, వసు ప్రతిరోజూ ఇటువంటి కష్టాలను కూడా ఎదుర్కొంటూందన్న మాట అని జాలి పడ్డాడతను భార్యపై.

కానీ బిచ్చగాడి కీర్తన అతన్ని ఎక్కువసేపు జాలిపడనివ్వలేదు. అసలతని దృష్టిని ఏ విషయం మీదకూ లగ్నం కానీకుండా పాడేస్తున్నాడు వాడు మంచి హుషారుగా. శ్రీనివాసరావుని నిరాశా నిస్పృహలు ఆవరించాయి. "నువ్వు వెళ్ళవా?" అన్నాడు నీరసంగా.

"ఏదో ఆదివారంపూట వచ్చాను. ఒక్కపైసా ఇప్పించండి బాబూ, పోతాను!"

ఇలా అనడం ద్వారా శ్రీనివాసరావు లోని ఆహాన్ని మరింత రెచ్చగొట్టాడు వాడు. "అడుక్కునే వెధవకి అంతపట్టుదల ఉన్నప్పుడు, సంపాదించుకునే నాబోటివాడి కెంత పట్టుదల ఉండాలి? నేనేం అంత చేతకాని వాడినా,ఏమైనా సరే వీడికి ఏమీ ఇవ్వకూడదు" అనుకున్నాడతను. కానీ వాణ్ణి బయటకు ఎలా పంపించాలో అతనికింకా తోచనే లేదు. ఈలోగా వసుంధర రానే వచ్చింది.

"ఏమయ్యా నిన్నే కదూ? పొమ్మంటూంటే పోవేం?" అంటూ వాడివంక ఉరిమి చూసింది.

"గంట సేపట్నించీ నించున్నాను. దరమ తల్లివి - ఒక్క పిడికెడు బియ్యం పెట్టించుతల్లీ" అన్నాడు వాడు మళ్ళీ.

"ఎవడు నించోమన్నాడు నిన్ను గంట? వెళ్ళు. దరమతల్లులు పక్కింట్లో ఉన్నారు, వెళ్ళు!" అని ఏమిటండీ ఇందాకట్నుంచీ వాడలా అరుస్తూంటే చోద్యం చూస్తున్నారు. ముష్టాడిని పొమ్మని చెప్పడమైనా చేతకాదేమండీ - అదీ నేనే చూసుకోవాలి, లోపలికిరండి" అంటూ అతను లోపలికి రాగానే భళ్ళున తలుపులు వేసింది వసుంధర.

"అనవసరంగా గంట సేపిక్కడ నిలబడ్డాను. ఏం తల్లివమ్మా!" అని విసుక్కుంటూ బిచ్చగాడు అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

శ్రీనివాసరావు తిన్నగా తన గదిలోకి వెళ్ళిపోయి మంచం మీద పడుకుని ఆలోచించసాగాడు. అంతసేపు అరుగుమీద కూర్చున్నాడన్న మాటేగానీ లోపలికి పోయి తలుపు వేసుకుంటే ముష్టివాడు వాడే పోతాడన్న ఆలోచన తనకు రాలేదు. వసుంధర అన్నట్టు తను చేతగానివాడే. తను ఎందుకూ పనికి రాడు!

బిచ్చగాడిని బయటకు పంపించడం చేతగాని తనకు కథలు వ్రాయడం మటుకు ఏం చేతనవుతుంది? అందుచేత కథలు వ్రాసే ఉద్దేశ్యం మానుకుంటే మంచిది? మరి, సుబ్బారావు.....

అప్పుడు శ్రీనివాసరావు ఒక్కటే అనుకున్నాడు. అసలు చేతకానివాళ్ళే కథలు వ్రాస్తారు. తను కథలు వ్రాయడానికి మరీ సుబ్బారావంత చేతకానివాడుకాదు. కాబట్టి తనిక కథలు వ్రాయ(లే)డు.

✦ ✦ ✦